

# రాజీ.

సియస్. రావు

కొండయ్య పాలెంలో సూరన్న వంశం

తాతలనాటి నుంచీ మోతుబరి వంశం

అయితే ఈ మధ్యకాలంలో రాఘవరావు వంశం మోతుబరి వంశం అయ్యింది

పాలానికి కొండయ్యపాలెమూ అని పేరు రావడానికి కారణం సూరన్న ముత్తాత ఎవరో ఆ గ్రామానికి శంఖుస్థాపన చేయడమేనట?

సూరన్నకు ఈ నాటికీ వందెకరాల మాగాణీ వుంది కాలవ కింద పొలం కావడంతో రెండు పంటలూ పండుతుంది నలుగురైదుగురు పాలేర్లు, పదికాళ్ళ ఎడ్లూ రెండు ఆయిలింజన్లూ, పాడిదూడలతోటి సూరన్న కమతం చూడ ముచ్చటగా వుంటుంది అందుకే ఈ నాటికీ ఊళ్ళోని పేదాసాదా సూరన్నను పేరు పెట్టి పిలవకుండా 'పెదకామందుగార'నే పిలుస్తారు

రాఘవరావు అసలు పేరు రాఘవయ్య

పదేళ్ళ క్రితం అతను పాతికెకరాల ఆసామీయే! కాస్త చదువుకున్న వాడు కావటంతో వరి వ్యవసాయాన్నే కాకుండా కాంట్రాక్టులు కూడా చేపట్టాడు కాలం కలసిరావడంతో లాభాలొచ్చాయి పాతికెకరాల కమతం అరవై ఎకరాలకి పెరిగింది ముతకపంచె, బనీను కట్టుకుని పొలంపని చూసుకునే రాఘవయ్య, ఖద్దరు వంచే, ఖద్దరు లాల్చీ వేసుకుని రాఘవరావుగా మారాడు అతని లక్ష్యం ఆ వూరికి తాను పెదకామందు అని పిలిపించుకోవడమే! రాఘవరావు ఆస్తి పెరగడంతోటి, సూరన్న ఆస్తి పెరక్క పోవడంతోటి యిద్దరి మధ్యా ఈర్ష్యలు పెరగడం మొదలైంది

ఆ రోజు—

రాఘవరావు పట్నం నుంచి వచ్చి స్నానం, భోజనం ముగించుకుని అరుగు మీద కవాసీ బెంచిమీద కూచుని సిగరెట్టు కాల్చుకుంటున్నాడు

రాత్రి తొమ్మిది గంటలు కావస్తోంది ఉద్దారుడు వీరయ్య మరునాటికి ఎంత మంది కూలీలను పెట్టాలో కనుక్కుని అప్పుడే వెళ్ళిపోయాడు పెరట్లో గొడ్ల సావిట్లోని గొడ్లని నీళ్ళు పట్టి తొట్టిలో గడ్డివేసి పాలేరు వెంకడు రాఘవరావు దగ్గరకొచ్చాడు పైమీది తుండుతో చేతులు దులుపుకుంటూ "ఇంకనే యెల్లొస్తానండి" అన్నాడు

ఊడుపులై పదిహేను రోజుల కావడంతో చేలకు నీరు పెట్టే రోజులవి కాలువకు ఎగువనున్న పొలాలు ముందుగా తడుస్తాయి దిగువనున్న పొలాలు తరువాత తడుస్తాయి ఆ కాలవకింద సూరన్న పొలం ఎగువన, రాఘవరావు పొలం సూరన్న పొలానికి దిగువనా వున్నాయి అందుకని రాఘవరావు "సూరన్నగారి పొలం తడిసిందట్రా?" అని అడిగాడు వెంకడ్ని

"ఇంకా రెండ్రోజులు పట్టేలా వుందండి! కొత్తనీరు రాకపోవడంతో కాలవంత ఒడిగాలేదు" అన్నాడు

"ఆయనగారి చేను తడిసేసరికి మన చేలు ఎండిపోయేలా వున్నాయి యింతకీ ఆయన చేను ఏ మాత్రం తడిసివుంటుందా?" అని అడిగాడు రాఘవరావు

"సగంపైగానే తడిసివుండొచ్చండి!" అన్నాడు వెంకడు

రాఘవరావు ఒక్కక్షణం ఆలోచించి "అయితే నువ్వెళ్ళి కాలవడ్డు తీసేసి ఈ రాత్రికి మన చేను తడుపు!" అన్నాడు రాఘవరావు

వెంకడు సరేననకుండా తటాపటా యించాడు


కారణం అది రివాజు కాకపోవడమే

"ఏమిట్రా బొమ్మలా నిలబడ్డావ్? నీక్కాదు చెప్పేది? వెళ్ళి చెప్పినట్టు చెయ్!" అని ఆదేశించాడు రాఘవరావు

వెంకడు "అది కాదండి' ఆడ్డు దగ్గర పెదకామందుగారి పాలేరు నారిగాడు కాపలావుంటాడు ఒకోసారి పెదకామందుగారుకూడా అక్కడేవుంటారు అందుకనీ " అని నసిగాడు

"చాల్లే! పిరికి తత్తుకొడకా? నారిగాడికి సమాధానం చెప్పలేవట్రా? వాడికున్న విశ్వాసం నీకుంటే మన చేలు ఎప్పుడో

జ్యోతి కథ కార్టూన్ రాజీ




తడిసేవి వెళ్ళి నే చెప్పినట్లు చెయ్ గొడవస్తే నే వస్తాను" అని రాఘవరావు లోపలి వెళ్ళిపోయాడు

ఆ మాటకి వెంకడి అహం దెబ్బతింది నిజానికి వెంకడు రాఘవరావు వున్నా లేకపోయినా నా బొందూ అని పాకులాడే మనిషి వాడికింకా పెళ్ళికాలేదు ఉన్న దల్లా ఒక్క తల్లి! తల్లికూడా మొన్న మొన్నటి దాకా కాయికష్టం చేసి బతికిందే ప్రస్తుతం జబ్బుపడి లేవటంలేదు నడుం కూడా వంగిపోయింది

యజమాని ఆదేశం ప్రకారం తెగింపుగా సూరన్నగారి పొలానికి నీరు పెట్టడానికి వేసిన అడ్డు దగ్గరికి వెంకడు వెళ్ళాడు

నారిగాడు లాంతరు చేత్తో పట్టుకుని చేత కర్రపుచ్చుకుని వేటకుక్కలా అడ్డు దగ్గర కాపలావున్నాడు అడ్డు ఎక్కడో బెసిగినట్టనిపించి లాంతరు ఒడ్డున పెట్టి కాలవలోకి దిగి గడ్డితోటీ, మట్టితోటీ అడ్డును బిగదీసాడు నారిగాడు ఇంతలో వెంకడు అక్కడికి చేరుకున్నాడు

"ఏరా, యింతరాత్రికాదొచ్చావ్?" అని పలకరించాడు నారిగాడు వెంకడ్ని ఆ పలకరింపులో వందెకరాల కామందు పాలేరు కుండాల్సిన హుందావుంది

వెంకడు "మా కాపు చేనుకు నీరెట్ట మంటేనూ " అన్నాడు

ఆ సమాధానంలో అరవై ఎకరాల రైతు అణుకువతనముంది

నారిగాడు వెటకారంగా నవ్వి, "పిచ్చిగాని ఎక్కిందేట్రా నీకు? మాచేను తడవకుండా మీ చేనుకు నీరెలా వత్తుందనుకున్నావ్? మీ కాపు కాంట్రాక్టులు మొదలెట్ట

వ్యవసాయం మరిచి పోయాడేటి?" అన్నాడు

"అందంతా నా కనవసరం మాకాపు మా చేనుకు నీరెట్టమన్నాడు అడ్డు తీసి నీరు పెట్టే వెడతాను మా చేనుకు" అని కర్ర ఒడ్డునపెట్టి పైగుడ్డ తలకి చుట్టి కాలవలోనికి దిగటానికి పంచె ఎగ్గట్టాడు వెంకడు

నారిగాడు అది సహించలేకపోయాడు తాను అడ్డదగ్గర కాపలా వుండగా అడ్డు తీయడానికి వచ్చిన మొగాడు యింత వరకూ ఎవరూ తగల్లేదు అందుకే వెంకడు కాలవలోకి దిగకుండానే నారి గాడు కర్ర రెండు చేతులా పట్టుకుని వెంకడ్ని ఓ నెట్టునెట్టి "వెళ్ళి మీ కాపును రమ్మను" అన్నాడు

ఎందుకనో నారిగాడి ముందు నిలబడ్డా నికి వెంకడికి ధైర్యం చాల్లేదు. వెంకడి మనసులో నారిగాడు వందెకరాల కామందు పాలేరు అన్నసంగతి అనుక్షణం మెదలు తూనే వుంది నారిగాడూ, తనూ పాలేర్లే అయినా తాను నారిగాడి ముందు చిన్న పాలేరుని అనే చిన్నతనం వాడి ధైర్యాన్ని దిగలాగుతోంది

వెంకడు తూలి నిలదొక్కుకుని, "సరే మా కాపును తీసుకొచ్చి అడ్డు తీస్తాను అడ్డు తీకుండా మాత్రం నిద్దరోతానని అనుకోకు" అని మొరాయించి రాఘవ రావు కోసం వెళ్ళాడు

వెంకడి కంటే కాస్త అనుభవం వున్న నారిగాడు కథ శ్రుతిమించేలా వుందని గ్రహించి లాంతరు కర్ర అక్కడే వుంచి సూరన్నకోసం వెళ్ళాడు

వెంకడు రాఘవరావు నిలేపి జరిగిం దంతా చెప్పాడు

రాఘవరావు కారాలూ మిరియాలూ నూరుతూ "చాతకాని తత్తుకొడక! ఆ నా గాడు కర్రతో గెంటితే అడ ముండలా తిరిగొచ్చేవా? కర్ర తిరగేసి ఒక్కటందు కొని అడ్డుతీసి రానక్కర్లేదుట్రా? కేసొస్తే నే చూసుకుందును పద!" అంటూ వెంకడ్ని వెంటబెట్టుకుని బయల్దేరాడు


ఆ దూకుడులో రాఘవరావూ వెంకడూ అడ్డు దగ్గరికి ముందుగా చేరుకున్నారు రాఘవరావు ఒడ్డున నిలబడి "ఊ దిగు' అడ్డు తీసెయ్" అని వెంకడ్ని కాలవలోకి దించాడు

వెంకడు అడ్డు తీస్తున్నాడు అంత దూరంనుంచీ "ఎవడ్రా కాలవలోకి దిగి అడ్డు తీస్తున్నదీ?" అన్న నారిగాడి అరుపు వినబడింది అరుపుతో బాటు ఒక్క పరుగులో నారిగాడు అక్కడికి చేర కున్నాడు కళ్ళముందు రాఘవరావు కని పించివుండకపోతే నారిగాడు ఒడ్డునవున్న కర్ర అందుకుని వెంకడ్ని ఓ దెబ్బవేసే వాడే రాఘవరావుని చూసి నారిగాడు ఆగి పోయాడు

"మీరు దగ్గరవుండే ఏంటండీ పని?" రాఘవరావుతో అని "గట్టెక్కవేరా?" అంటూ గదమాయించాడు నారిగాడు

ఇంతలో సూరన్నగారు వొచ్చారు. "ఏమిటయ్యా తగూ?" అన్నాడు సూరన్న రాఘవరావు నుద్దేశించి

"తగువంతా మీ నారిగాడిదే! నా పాలేరు అడ్డుతీసి చేనుకి నీరు పెడు తూంటే అడ్డు తగులుతున్నాడు" అన్నాడు




రాఘవరావు

"ఇదెక్కడి న్యాయమయ్యా? నా చేను తడవకుండా నీ చేనెలా తడుస్తుంది? అలా ఎన్నడయినా జరిగిందా?" అన్నాడు సూరన్న పెద్దమనిషి తరహాతో

"అలా వెనుకటి రోజుల్లో జరక్కపోవచ్చు కానిప్పుడు రోజులు మారాయి. ఓ కాలంలో ధర్మం కలకాలం ధర్మం కావాలనిలేదు దేశమంతా సమానత్వం, సమానత్వం అని గగ్గోలు పెడుతూంటే మీ వందెకరాలు పండించుకుని మా చేలన్నీ ఎండబెడతారా?" అన్నాడు రాఘవరావు

"ఇదిగో చూడు రాఘవరావు, నేను చీటికీ మాటికీ టౌనుకు వెళ్ళే మనిషిని కాను ఈ సమానత్వాలూ, గొడవలూ నాకు తెలియవ్ ఆదినించీ ఒక రివాజుకి కట్టుబడి ఓ కట్టుబాటు ప్రకారం నడిచే మనిషిని నేను పై చేను తడిస్తేగాని కిందచేను తడవడానికి వీల్లేదు" అని సూరన్న రాఘవరావుకు చెప్పి, "ఒరే నారిగా! కాలవలో దిగి కట్టు కట్టేయ్!" అన్నాడు సూరన్న

"అలా వీల్లేదు ఈనాటి రివాజు ప్రకారం మీ అరవై ఎకరాలు తడిసాక నా అరవై ఎకరాలు తడవాలి ఆ తరవాత కావాలంటే మిగిలిన మీ నలభై ఎకరాలూ అడ్డువేసి తడుపుకోండి" అన్నాడు రాఘవరావు

అప్పటికే అక్కడికి చేరిన ఓ చిన్న రైతు సమానత్వం గురించి రాఘవరావు మాట్లాడుతున్న మాటల్ని నాగస్వరంలా

వింటున్నాడు అతడు మూడెకరాల ఆసామీ రాఘవరావు చేను తడిస్తేగాని తన చేనుకి నీరు రాదు రాఘవరావు చేలో మూడెకరాల చేను తడిపినతరువాత కాలవకు అడ్డులేపి తన మూడెకరాలూ తడుపుకోవచ్చనుకున్నాడు. రాఘవరావు మాటలు వింటున్నప్పుడు కాని అతని అరవై ఎకరాలూ తడిసిన తరువాత కావా లంటే తన నలభై ఎకరాలూ తడుపుకో మని సూరన్నతో రాఘవరావు అన్న మాటలు విన్న ఆ చిన్నరైతు "ఈ సమా నత్వమన్నది అరవై ఎకరాలవాళ్ళకీ, వందెకరాలవాళ్ళకీగాని మూడెకరాలవాళ్ళకి వర్తించదా?" అని

"ఈ మాటలన్నీ అనవసరం కావా లంటే వచ్చే ఏటినుంచీ ఊళ్ళోని పది మంది రైతులూ కూడబలుక్కొని నువు చెప్పినట్టు చేద్దాంలే" అని సూరన్న రాఘవరావుతో చెప్పి తన మాట తుది నిర్ణయమన్నట్టు, "ఒరే నారిగా కాలవ కడ్డు వేసెయ్!" అని ఆదేశించాడు

రాఘవరావు, "ఒరేయ్ వెంకా, ఏమైనా సరే అడ్డు తీయనీయకు" అన్నాడు

వెంకడు అడ్డు కడ్డుగా నిలబడ్డాడు

సూరన్నకు ఒళ్లు మండిపోయింది ఇంతవరకూ అతనికా వూళ్ళో ఎదురు లేదు ఎదురుతిరిగింది రాఘవరావే అయినా వెంకడ్ని చూస్తే ఊరే ఎదురు తిరిగినట్టనిపించింది

"చూస్తావేంరా? వాణ్ణి గెంటి పదేసి అడ్డేసెయ్!" అన్నాడు నారిగాడితో సూరన్న.

రాఘవరావు ఏమీ అనకపోయినా తన విశ్వాసాన్ని రుజువు చేసుకుందుకు వెంకడు, "మీద చెయ్యేడితే పుచ్చెగిరి పోతుంది" అని ఒడ్డున వున్న కర్రందు కున్నాడు

"ఇంతవరకూ పెద్దోళ్ళు మాట్లాడు కుంటున్నారు కదాని ఊరుకున్నారా! నాకే అడ్డు నిలుస్తావా?" అంటూ నారిగాడు తన కర్రెత్తాడు

ఆ దెబ్బను వెంకడు కాసుకున్నాడు వెంకడు కాలవలో ఉండడంచేత నారిగాడు ఒడ్డున వుండడంచేత దెబ్బ వీలు నారి గాడికే బాగుంది రెండు పుంజులూ కలియ బడ్డాయి శక్తికొద్దీ పోరాడాయి వాళ్ళిద్దరే ఒకడు వందెకరాల ఆసామీలాగా మరొ కడు అరవై ఎకరాల ఆసామీలాగా పోరా డారు కాలవలో వున్న పుంజుకి నెత్తి పగిలింది కెవ్వున అరిచింది

రక్తం చూసి ఒక్కక్షణం నారిగాడి ఒళ్లు జలదరించింది కాని పక్కన కామందు వుండడంతో ఆయన పరువు నిలబెట్టడంకోసం దెబ్బ మీద దెబ్బ కొట్టాడు వెంకడు కాలవలోకి ఒరిగి పోయాడు

"ఛీ! చాతకాని వెధవ!" అని రాఘవ రావు అవమానంతో విసురుగా వెళ్ళి పోయాడు

కాలవ ఎర్రబడింది


నారిగాడు దిగి అడ్డు బిగించాడు

సూరన్న నవ్వుకుని వెళ్ళిపోయాడు

* * *

తెల్లవారింది

రాత్రి జరిగిన గొడవ ఊళ్ళోనూ




మాలపల్లిలోనూ గుప్పుమంది వెంకడు తల్లి పుత్రమ్మ గుండెలు బాదుకుంటూ నలుగురితోబాటు సూరన్నగారి కాలవ అడ్డుదగ్గరి కొచ్చింది కాలవలోకి ఇద్దరు దిగి, వెతికి వెంకడి శవాన్ని ఒడ్డుకు చేర్చారు

పోలీసులొచ్చారు

కేసు రిజిస్టరు చేశారు

రాఘవరావు వెంకడి తల్లి చేత నారిగాడు సూరన్న ప్రోద్బలంతో వెంకడ్ని కొట్టి చంపాడని వాఙ్మూలం యిప్పించాడు

సూరన్న రాఘవరావూ, వెంకడూ కలిపి కాలవ అడ్డు దగ్గిర కొట్లాటకు వచ్చి తమని కొట్టారనీ ఆ దొమ్మిలో రాఘవరావు కఱ్ఱ దెబ్బే వెంకడికి తగిలి చచ్చిపోయాడనీ తన పాలేర్ల చేత వాఙ్మూలం యిప్పించాడు కేసు బలంగా వుండడంకోసం నారిగాడి చేతిమీద ఓ కఱ్ఱదెబ్బ కొట్టించి డాక్టరు సర్టిఫికెట్టు కూడా తీసుకున్నారు.

యిరు పక్షాలవారూ కోర్టులకి తిరుగుతున్నారు హత్యకేసు కావడంతో, కేసు పకడ్బందీగా జరుగుతోంది

రాఘవరావు పోలీసులకు మద్దత్తు

సూరన్నకు పెద్దవాళ్ళ అండ

రెండు సింహాలు ఒకరిమీద పడి కాట్లాడుకుంటున్నట్టుగా వుంది

అలా రోజులు గడుస్తున్నాయి

నారిగాడు జైల్లో వున్నాడు

సూరన్నా, రాఘవరావులు జామీను మీద బయటికి వచ్చేసి యిరుపక్షాల కేసుల్ని నడుపుతున్నారు

* * *

అనుకోకుండా సూరన్నా, రాఘవరావులు తమ తమ కుటుంబాలతో పొరు

గూరికి ఒక పెద్దింట్లో పెళ్ళికి వెళ్ళారు బంధువులందరూ కలిసి మెలిసి వున్నా. వాళ్ళిద్దరూ మాత్రం ఎడమొఖం పెడ మొఖంగా వున్నారు పెళ్ళికొచ్చిన బంధువులకి వాళ్ళిద్దరి పరిస్థితి బాగనిపించలేదు ఎలాగైనా వాళ్ళిద్దరికీ రాజీ పెట్టాలను కున్నారు భోజనాలయిన తరవాత పెళ్ళి పెద్దా, యితర పెద్దలూ కూర్చుని రాఘవ రావునీ, సూరన్ననీ కూచోబెట్టి సర్ది చెప్ప టానికి ప్రయత్నించారు కాని ఫలితం కనిపించలేదు పెళ్ళిపెద్ద మంచి వ్యవహారత కావడంతో తన చాకచక్యాన్ని ఉపయోగించాడు.

"ఎవడో కూలాడు చచ్చాడనీ మీరిద్దరూ కోర్టుకెక్కడం ఏమిటయ్యా? యిలాంటి తగాదాలు గ్రామాల్లో వస్తూనే వుంటాయి రేపు వేసంగుల్లో మీరిద్దరూ వియ్యంకులవుతారని మేమనుకుంటూంటే ఇదేం బాగోలేదు" అని రాఘవరావుకి చిన్న ఎర చూపాడు ఎలా అంటే—రాఘవరావుకి ఒక్కగా నొక్క కొడుకు సూరన్నకు ఒక్కగా నొక్క కూతురు

అంటే—అరవై ఎకరాలూ, వందెకరాలూ కలిసి ఆ వియ్యంద్వారా నూటరవై ఎకరాల కమతం అవుతుందని రాఘవరావు గ్రహించాడు

"నాకు కేసులంటే సరదా ఏమిటండీ? అయనటున్నాడుగదాని నేనిటుండాల్సి వచ్చింది లేకపోతే వెంకడు చస్తే నాకేం, నారిగాడు జైల్లో వుంటే నాకేం" అని తేల్చేశాడు రాఘవరావు

సూరన్న, "నే నెన్నడయినా కోర్టు కెక్కనేమిటి?యితగాడు ఇన్నాళ్ళకి నన్ను లాగాడు వేలకివేలు అరాయించుకు పోతున్నాయి" అన్నాడు

"ఈ గొడవలన్నీ ఎందుకు? నేను రేపు మీ వూరొస్తాను ఆ ముసల్దాన్ని పిలిచి ఒక్కమాట కోర్టులో చెప్పిస్తే కేసు పుట్టున తేలిపోతుంది తరవాత ముహూర్తాలు పెట్టించుకోవచ్చు" అన్నాడు పెళ్ళి పెద్ద

అన్నమాట ప్రకారం పెళ్ళి హడావుడి పూర్తయిన తరువాత పెళ్ళిపెద్ద కులపెద్దగా కొండయ్య పాలెం వొచ్చాడు ఆస్తి అంతస్థూపలుకబళ్ళవిషయంలో సూరన్న. రాఘవరావులకంటే అతను చాలా పెద్దవాడు ఉంగారాల వేళ్ళతో మొడితే వినక తప్పుతుందా మరి?

సూరన్న యింటి దగ్గర తగువు ప్రారంభమయ్యింది నిజానికది తగువు కాదు ఒక మనిషికి చావుకి కిమ్మత్తు కట్టడానికి ఏర్పాటయిన సభ తక్కెట్లో ఒకప్రక్క మనిషి ప్రాణాన్ని, మరోప్రక్క డబ్బునీ వేసి సరితూచే ధర్మ నిర్ణయ సభ అది ఆ ప్రాణం ఖరీదు ఆ ప్రాణం వెనక వున్న ఆస్తిని బట్టి మారుతూ వుంటుంది అండదండల్ని బట్టి ఎక్కువ తక్కువ లవుతూ వుంటుంది

వెంకడి తల్లి ముసలిదాన్ని కబురంపించారు ఆ ముసలిది వెంకడు పోయాక మరీ చిక్కి శల్యమైపోయింది కళ్ళల్లో ప్రాణం పెట్టుకుని కామందులు కబురంపారని వచ్చింది తన కొడుక్కీ తనకీ బంధం తెగిపోయినా, తన కొడుకు చావు కేసుకీ, తనకీ యింకా బంధం వుందికదాని వొచ్చింది

"ఏవేఁ పుత్రమ్మా! బాగా వంగి

పోయావు సుమా!" అన్నాడు సూరన్న

"కొడుకు పోయాక మరీ డీలాపడి పోయింది వాడు పోయినప్పట్నుంచీ నేనే తిండి గింజలు పంపుతున్నాను" అన్నాడు రాఘవరావు

"పోయిన కొడుకుని తేలేము కానీ, దానికి కూటికీ గుడ్డకీ లోటేముంది మన ముండగా?" అన్నాడు సూరన్న

తనమీద ఎందుకింత ఆదరాభిమానాలు పెరిగిపోయాయో అర్థంకాని పుత్రమ్మ గుడ్లు వాదిలేసి చూస్తోంది నోట మాట రావటంలేదు

సూరన్నా రాఘవరావుల కులపెద్ద కలగజేసుకుని, "చూడు పుత్రమ్మా పోయిన కొడుకు ఎలాగూపోయాడు కోర్టుల చుట్టూ తిరిగి కేసులు నడిపితే మాత్రం తిరిగొస్తాడా చెప్పు? అందుకే నేను మావాళ్ళద్దరితో చెప్పాను ఆ ముసల్దానికి ఓ వెయ్యి రూపాయలివ్వండీ, అది కూడా బతికినంతకాలం బతకదూ అని! ఆ డబ్బు తీసుకుని నీ ముప్పు చింపుకో!" అన్నాడు

"తమరందరూ పెద్దోళ్ళు బాబూ! అన్నీ తెలిసినోరు డబ్బు నాకెందుకు బాబూ! మీరందరూ ఎలాగంటే అలాగే" అంది పుత్రమ్మ

"డబ్బెందుకు అనకే! నీ కొడుకుంటే ఏలోటూ లేకుండా సాగిపోయింది నీకు అడు పోయాడు కాబట్టే ఈ డబ్బే నీకు కొడుకనుకో! కాకపోతే కోర్టులో ఓ మాట చెప్పాలి" అన్నాడు కులపెద్ద

"ఏమని బాబూ!" అంది పుత్రమ్మ

"నా కొడుక్కి మూర్ఛ రోగం ఉందీ కాలవ అడ్డుతీయడానికి కాలవలో దిగి పడి చచ్చిపోయాడూ, రాత్రి మూలంగా ఎవరూ చూళ్లేదూ" అని చెప్పాలి కోర్టులో

"అది నెత్తిమీద దెబ్బలున్నాయి గద బాబూ!" అంది పుత్రమ్మ

"మూర్ఛ ఒచ్చినప్పుడు తల కాళ్లూ కొట్టుకుంటాడూ కాల ఒడ్డునున్న సర్వే రాయికేసి తల కొట్టుకోవడంచేత తల పగిలిందీ అని చెప్పు!" అన్నాడు కోర్టు సంగతి తెలిసిన రాఘవరావు

పుత్రమ్మ నవ్వుకుంది

"నేను కాదంటే మాత్రం, మీరందరూ అవునంటే మీమాటే నెగ్గుదిగా బాబూ! అడు నన్ను పిడికెడు బూడిద చేస్తాడనుకున్నాను సచ్చిందాకా పట్టెడు కూడెడతాడనుకున్నా! అలా సెయకుండానే పోయినా అడుమాత్రం నా రుణం తీర్చుకుంటున్నాడు నాకు పట్టెడు అన్నానికీ, నేను పిడికెడు బూడిదవటానికీ, అడు సచ్చి ఈ డబ్బు ఏర్పాటుచేసాడు నా కొడుకింత సవక అనుకోలేదు బాబూ" అని వెళ్ళిపోయింది

కులపెద్ద "ఆ వెయ్యి రూపాయలు కూడా పూర్తిగా తినేదాకా బ్రతకదులే యిది కాని పోయేలోపున దానిచేత మనం అనుకున్నట్టు మాత్రం ఆ వాఙ్మూలం యిప్పించండి కోర్టులో" అన్నాడు

అలా రాజీ పడిపోయారు

వెంకడి ప్రాణం ఖరీదు వెయ్యి రూపాయలు

